

కథ

**ఆవకాయంటే ఇష్టంలేనిదెవరికి? ఒకప్పుడు ఎ.పి. ఆవకాయకి ప్రసిద్ది! రాను రాను దీని పేరు ప్రఖ్యాతులకు ఎల్లల్లేకుండా పోయినాయ్. ఊరగాయల వ్యాపారం పాకాన పడడంతో ఆవకాయకి కాళ్ళొచ్చి గ్రహాంతరయానం చేసినట్టు విదేశీయానం చేసింది. ఇప్పుడు ఇతర కంట్రీస్‌లో సైతం ఆవకాయ అమ్మకం జోరుగా జరుగుతోంది.**

# బామ్మశ్రీ !

**ఎస్. వివేకానంద**

ఆవకాయ ఊరగాయ పెట్టటమంటే ఆషామాషీ కాదు. ఆవకాయ పెట్టటంలో మా బామ్మకున్న నేర్పు ఇతరులకు లేదు. దోసకాయ పప్పు చేసినా.. ఉలవచారు పెట్టాలన్నా.. ఆవకాయ పెట్టాలన్నా అది ఒక్క మా బామ్మకే చాతనవుతుంది.

బామ్మపెట్టే ఆవకాయ రుచేవేరు. మరే ఇతరమైన ఆవకాయ అయినా బామ్మపెట్టే ఆవకాయకి సాటిరాదు.

అసలు.. ఆవకాయ ఎన్ని రకాలుగా పెట్టచ్చో మా బామ్మకు తెలిసినంతగా ఇతరులకు తెలీదు. పెసర ఆవకాయ.. ఉల్లి ఆవకాయ.. టెంక ఆవకాయ.. ఈ విధంగా ఎన్నో రకాలుగా ఆవకాయ పెట్టచ్చని మా బామ్మ చెప్తుంటే వినేవారు నోరెళ్ళబెట్టక తప్పదు! ఆహా.. ఓహో.. అంటూ అమ్మో ఆవకాయలో ఇన్ని రకాలుంటాయా అని హాశ్చర్యంతో ముక్కున వేలేసుకుంటారు.

ఆవకాయ పెట్టటంలో పోటీ నిర్వహిస్తే గోల్డ్ మెడల్ బామ్మకే వస్తుంది. ఆవకాయ పెట్టటంలో పి.హెచ్.డి చేసి పట్టాపుచ్చేసుకుంది. ఓ యూనివర్శిటీ వారు గౌరవ డాక్టరేటిచ్చేశారు బామ్మకి. మా బామ్మలెవలే వేరు. కాలనీలో మహిళా సమాజం వారంతా బామ్మను గౌరవంగా బామ్మశ్రీ అనే పిలుస్తారు.

ఊరగాయలు పెట్టటంలోనూ ప్రభుత్వం పద్మశ్రీలు ఇవ్వతలిస్తే.. మొట్టమొదటి పద్మశ్రీ మా బామ్మకే వచ్చినట్టొస్తుంది.

బామ్మశ్రీ పేరు గిన్నీస్ బుక్‌లో కెక్కేసింది. ఆవకాయ పెట్టటంలో గల నైపుణ్యాన్ని మహిళాలోకం తెగపొగిడింది. ఆల్మోస్ట్ అన్ని టి.వి. స్టేషన్లవారు బామ్మశ్రీతో ప్రత్యేక ఇంటర్వ్యూలు నెరిపి టెలికాస్ట్ చేసారంటేనే అర్థమవుతుంది. ఆవకాయ పెట్టటంలో ఆమెకు గల ఘనతేమిటో!

ఆవకాయ పెట్టటం గురించి ఎవరైనా నోటికొచ్చినట్టు అడ్డదిడ్డంగా వాగితే.. వారిని ఉతికి ఆరేస్తుంది. ఠక్కున నోరు మూయిస్తుంది! అంతే!

ఒక్కసారి బామ్మచేతి ఆవకాయ తిన్నారంటే ఇక జీవిత కాలంలో మరచిపోలేరు.

నేను డిగ్రీ ఫైనల్లోకొచ్చినా.. వేడి వేడిఅన్నంలో ఆవకాయ వేసి కలిపి ముద్దలుచేసి మా బామ్మశ్రీ నా నోటికి అందిస్తుంటే.. కళ్ళు మూసుకొని నోట్లోముద్దనములుతూ తదాత్మ్యం చెందేవాడిని!

ఒక్క పద్మశ్రీ ఏంటి?.. భారతరత్న బిరుదులాగా మా బామ్మకి ఆవకాయ రత్న అనే బిరుదిచ్చి సత్కరిస్తే ఆవకాయంత అద్భుతంగా ఉంటుందంటే నమ్మండి!

ఆవకాయ గురించి అనువుగా గంటలతరబడి ఉపన్యసించగల దిట్ట మా బ్యామ్మశ్రీ!

ఓసారి ఏమయిందంటే.. సంక్రాంతి ముగ్గులపోటీలు నిర్వహించినట్టే.. అఖిల భారత మహిళాసంఘం వారు ఢిల్లీలో ఆవకాయ తీరుతెన్నులు గురించి పోటీలు పెట్టటంతో..బామ్మ కూడా పాల్గొనడానకి అక్కడికి వెళ్ళింది. మా బామ్మ కట్టు.. పర్సనాలిటీ చూచి ఈవిడగారికేం తెలుసు ఆవకాయ గురించి అని ఫకాలున నవ్వారట.

ఆడంగులంతా అలా నవ్వటంతో బామ్మశ్రీకి వళ్ళు మండింది. మాటల్తో ఏంపని?.. చేతల్తో చూపుతా తడాక అనుకొని.. నవ్విన నాపచేనే పండుననే సామెత మనసులో గుర్తుకు తెచ్చుకుని.. తన వంతు రాగానే మైక్ ముందుకెళ్ళి నిలబడి అరగంటసేపు అనర్గళంగా ఉపన్యసించి.. పోటీల్లో బెస్టే కాకుండా.. ఫస్టొచ్చి బంగారు మామిడికాయ రూపులో గల ట్రోఫీని కైవసం చేసుకుని.. ఆంధ్రుల ఆవకాయ ఘనత చాటింది.

సో... దటీజ్ బామ్మశ్రీ!

× × ×

ఎనభైయ్యోవపడిలో సైతం వడివడిగా నడవగలదు బామ్మశ్రీ! అంటే... అంతటి ఆరోగ్య వంతురాలన్నమాట! ఇప్పటికే చెక్కిలాలు.. జంతికలు ..బఠాణీలు పటపట నమలేస్తుందంటే ఎవరికీ నమ్మశక్యం కాదు. ఒక్క పన్నైనా వూడలేదు. కంటి చూపు తగ్గలేదు. ఇన్నేళ్ళ తన జీవితంలో ఆఫ్టాల్ తలనొప్పి అయినా ఎరగదు. అర్ధశేరు బియ్యపు అన్నం ఈనాటికీ సులువుగా లాగించి హరాయించుకో గల జీర్ణశక్తి ఉంది.

ఇంటెడి చాకిరీ వంటి చేత్తో చేసి అవతల పారేస్తుంది.కోడళ్ళను వంటింటి ఛాయలకు రాకండి అంటూ శాసిస్తుంది.

ఈతరం వారికి ఊరగాయలు పెట్టటమే చేతనై ఏడవదు అంటూ కామెంట్ చేస్తుంది. తన శక్తిని ఎవరైనా శంకిస్తే.. ఆదవడ ఈదవడ వాయించేస్తుంది.

తీరిక సమయాల్లో.. అమెరికాలో ఉంటున్న మనుమలతో ముని మనుమలతో ఇంటర్‌నెట్‌లో ఛాట్ చేస్తుంది.

సెల్ ఎలా ఉపయోగించాలో నాకిప్పటికీ తెలీదు. అలాంటిది.. టీ.వీ. ముందు కూర్చొని మొబైల్లో ఎస్.ఎమ్.ఎస్‌లు పంపగల తెలివి తేటలున్న మనిషి బామ్మ!

ఆవకాయ సీజనొస్తే బామ్మశ్రీ హడావిడి అంతా ఇంతా కాదు. ఎండుమిర్చి..ఆవాలు

దంపించడం ఒకే చెట్టు మామిడి కాయలు కొని తెచ్చి నీళ్ళల్లో కడిగి వాటిని పొడి గుడ్డతో తుడిచి కత్తిపీట ముందు కూర్చొని సరిసమానమైన రీతిలో ముక్కలుగా తరగటం.. గానుగ ఆడించిన పప్పునూనె తెప్పించి..కలిపిన ఆవకాయను జాడీలకు ఎత్తడం వంటిది చేసి.. కూతుళ్ళకు.. మనుమరాళ్ళకు.. కోడళ్ళకు.. విదేశాల్లో ఉన్న మనుమలకు పంపేవరకు ఆమె నిద్రపోదు.

ఎవరైనా సరే తన బంధువర్గంలో వారిని షాపుల్లో సీసాల్లో లభించే ఊరగాయ తినవద్దని ఉచిత సలహా ఇచ్చేస్తుంది.వాటిలో ప్రిజర్వేటివ్స్ ఉంటాయని అవి ఆరోగ్యానికి చెరుపు చేస్తాయని మెడికల్ టరమ్స్‌లో మాట్లాడుతుంది.

మా కుటుంబంలో వారందరూ ముప్పొద్దులా అన్నంలో ఆవకాయ కలుపుకొని మెక్కాల్సిందే! అదిలేకపోతే ముద్ద గొంతు దిగదు.

× × ×

అమెరికాలో ఉంటున్న బామ్మ పెద్ద మనమడు ఆమెను అక్కడికి రావలసిందిగా కోరుతూ ఫ్లైట్ టిక్కెట్ కొని కొరియర్‌లో పంపటం చూచి బామ్మశ్రీ ఎగిరి గంతేసింది. నాకైతే బామ్మ సంబరం చూచి నవ్వాగింది కాదు.

ఎందుకలా అలా వెధవ నవ్వు నవ్వటం.. అక్కుపక్షి.. అంటూ నన్ను శాపనార్థాలు పెట్టింది.

విమాన ప్రయాణమంటే జట్కాబండిలో ఊళ్ళో తిరగటం కాదే బామ్మ..అందులోనూ నీకు ఇంగ్లీషు వచ్చి చావదు కదా?–ఎలా వెళ్ళగలుగు తావు!–అన్నాను.

నోర్ముయ్యరా కుర్రకుంక! నాకన్నీ తెలుసు మా పెత్తల్లి ఒకామె..చదువు సంధ్యా లేకపోయినా దేశానికి స్వాతంత్ర్యం రాకముందే విమానంలో ఒంటరిగా విదేశాలు తిరిగొచ్చింది ఎంచక్కా! నోరున్న దాన్ని నేను వెళ్ళిరావటం పెద్ద కష్టమేం కాదు...

బామ్మ అమెరికా వెళ్ళబోతున్నందుకు ఇంట్లో కుటుంబ సభ్యులందరం ఆనందంతో చిందులేశాం.

మా డాడీ పనిచేస్తున్నది ఆఫీసులో కనుక.. వీసా పాస్‌పోర్ట్ చిటికెలో వచ్చేసినయ్.

ఇన్నేళ్ళల్లో బామ్మశ్రీ మమల్ని వదలి ఎప్పుడు ఎక్కడికీ వెళ్ళలేదు. అలాంటిది.. బామ్మ మాకు దూరమై విమానంలో ఎగిరి అమెరికా వెళుతుందంటే నా మటుకు నాకు మనసులో దిగులైంది.

ఆమె తిరిగొచ్చేదాకా.. వెండికంచంలో.. నాకు ఆవకాయ, అన్నం కలిపి.. ముద్దలు చేసి నా నోటికి ఎవరు అందిస్తారు.

వెధవాయ్ నేను తిరిగొచ్చేదాకా ఎలాగో అలా నువ్వే కలుపుకొని తినేదువ్... నా తల నిమురుతూ అంది. నన్ను నేను సముదాయించుకున్నాను.

అమ్మా! నీతో తీసుకెళ్ళవలసినవన్నీ సర్దుకున్నట్టేనా?– మా డాడీ అడిగాడు బామ్మని.

ఆహా ! కొత్త ఆవకాయ జాడీతోపాటు జంతికలు.. కారప్పూస.. చేగోడీలు.. అరిసెలు అన్నీ మూటలు కట్టేశాను.. హుషారుగా బామ్మ బదులిచ్చింది.

చుట్టూవున్న మా అందరికేసి.. ఇక తాను తిరిగి రాదేమో..ఇదే కడసారి చూపు.. అనే భావనతో చూచింది.అప్రయత్నంగా బామ్మ కంటిలో నీరు తొణికిసలాడటం అందరం గమనించి బాధపడ్డాం.

అత్తవారింటికెళ్ళే ఆడపిల్లకి వీడ్కోలు ఇస్తూ సాగనంపినట్టు..కళ్ళ నీళ్ళతో బామ్మకి టాటా చెప్పేశాం.

డాడీ కారు డ్రైవ్ చేస్తూ.. పక్కనే వున్న వాళ్ళతో ముచ్చటిస్తూ.. ఎయిర్‌పోర్ట్ చేరుకున్నాం.

బామ్మకి ధైర్యం నూరిపోస్తున్నాడు డాడీ! ఫార్మాలిటీస్ పూర్తయి.. ఫ్లైట్ ఎక్కేటందుకు క్యూ లో నిలుచుంది బామ్మశ్రీ.

ఫ్లైట్ గాలిలోకి కైట్‌లాగా ఎగరగానే మేమంతా వెనుదిరిగి కారులో ఇంటికొచ్చేశాం.

తెల్లచీర..నెత్తిన ముసుగు ధరించిన విధవరాలైన బామ్మవైపు తోటి ప్రయాణికులలో కొందరు విస్మయంగా చూశారు.

ట్రేలో డ్రింక్స్‌తో వచ్చింది హోస్టెస్. అవేవి తనకక్కర్లేదనే భావనతో తల అడ్డంగా ఆడించింది. వెంటనే తన హేండ్ బ్యాగులోవున్న, కారప్పూస పలుకులు బైటికి తీసి గుప్పిట వుంచి కొద్ది కొద్దిగా కర..కర..నమలటం మొదలు పెట్టింది బామ్మ.

బామ్మ నములుతున్నప్పుడు వస్తున్న చప్పుడికి కోపాసింజర్స్ అదోలా ఆమె వైపు చూచినా.. అది అగౌరవంగా భావించని బామ్మ మరి కొంచెం శబ్దం చేస్తూ తింటూనే వుంది.

తరువాత కాస్సేపటికి నిద్రలోకి ఒరిగి పోయింది. నిద్రలేచిన చాలా మంది పాచి ముఖాలతో కాఫీ తాగటం గమనించినా తాను మాత్రం టాయిలెట్స్‌కి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని దంతధావనం ముగించుకొచ్చి సీట్లో కూర్చుంది.

కొద్ది గంటల ప్రయాణం తరువాత ఇంటర్‌నేషనల్ ఫ్లైట్లో చికాగో చేరింది. హమ్మయ్య మొత్తానికి గమ్యం క్షేమంగా చేరినట్టే అనుకుంటూ విమానం దిగింది.

లగేజ్..పాస్ పోర్ట్..టిక్కెట్ వెరిఫికేషన్ సమయంలో..చెకింగ్ అఫిషియల్స్‌కి ఏం అనుమానం వచ్చిందో ఏమో బామ్మని పక్కనే నిలబడమని సైగ చేసి మిగతా పాసింజర్ల విషయంలో లీనమవటం గమనించిన బామ్మకి వళ్ళు మండినట్లనిపించింది.

'ఐ..అన్నపూర్ణమ్మ..ఇండియా..' అంటూ వచ్చీ రానీ ఇంగ్లీషు పొడి పొడిగా మాట్లాడింది.

మరో ముగ్గురు అధికారులు అక్కడికి వచ్చారు. బామ్మ వెంటనున్న ఆవకాయని చెక్ చేస్తూ బ్లడ్..బ్లడ్..అంటూ కల్లుతాగిన కోతిలా చిందులేశాడు ఒక చెకింగ్ అధికారి.

ఆవకాయను చూచి బ్లడ్ అంటాడేమిటి వెర్రి పీనుగ అనుకుంది మనసులో,

ఎందుకైనా మంచిదన్పించి దటీజ్ ఆవకాయ... ఆవకాయ... అంటూ తెలియచెప్పింది. అక్కడున్న అధికారులకు.

వాట్ ఆవకాయ్?...అరిచాడు

నీ తలకాయ్! తిక్క వెధవకు ఆవకాయ అంటే ఏమిటో కూడా తెలిసేడవదు. మనసులో గొణుక్కుంది.

మరొక ఆఫీసరు అందులో వేలు పెట్టి ఆవకాయ కారం మంటెత్తుతుందని తెలీక నాలుక మీద వేసుకున్నాడు.- అదేమిటో రుచి చూద్దామని.

'మడితో పెట్టి వెంట తెచ్చుకుంటున్న ఆవకాయరా అది. అంట్ల వెధవ..అందులో వేళ్ళు పెట్టి చూస్తావేం?' తెలుగులో చీవాట్లు పెట్టింది.

ఇంతలో బామ్మశ్రీ మనమడు రాజీవ్ అక్కడ ప్రత్యక్షమవటం చూచి వరేవ్... లగేజీ చెక్‌చేసి వీళ్ళు నన్ను నా నా తిప్పలు పెడుతున్నారు. ఆవకాయలో వేళ్ళు పెట్టాడొకడు. బ్లడ్..బ్లడ్ అంటూ చిందులేశాడు మరొకడు...వీళ్ళ అనుమానం ఏమిటో? నాకు బోధపడి చావడంలేదు... ఫిర్యాదు చేసినట్టు మాట్లాడింది బామ్మ.

రాజీవ్ అక్కడి వారితో వివరంగా మాట్లాడి వారిని ఒప్పించి...బామ్మను. లగేజీని బైటకు తీసుకొచ్చాడు. మొత్తానికి ఆ రాక్షసుల బారినుండి సమయానికొచ్చి కాపాడేవుకదరా..లేకపోతే నన్ను నానా ప్రశ్నలు వేసి పీక్కుతినే వాళ్ళు..అంది కారెక్కి కూర్చొని.

నీ ఆవకాయ ఊరగాయ కాదుగానీ... మొత్తానికి తెల్లవారిని హడలు గొట్టావ్...కారు డ్రైవ్ చేస్తూ పకపకా నవ్వాడు రాజీవ్.

బామ్మశ్రీ కూడా మనమడి నవ్వులో శృతి కలిపింది.